సాక్షి పార్వతీపురం మన్యం

బుధవారం । 17 । సెప్టెంబర్ । 2025



మారథాన్‌కు సిద్ధం

విద్యార్థుల ఆలోచనలను ఆవిష్కరణలుగా రూపొందించేందుకు, ప్రోత్సహించే చక్కని వేదిక స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్.

- 8లో



కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయుల నిరసన

ఏపీటీఎఫ్ రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు వారం రోజుల నిరసనలో భాగంగా కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయులు నిరసన తెలిపారు.

- 8లో



భారత్‌తో భాగస్వామ్యానికి ఫ్రాన్స్ ఆసక్తి

భారత్‌తో విద్యా భాగస్వామ్యానికి ఫ్రాన్స్ దేశం ఆసక్తి చూపిస్తోందని ఆ దేశం కాన్సులేట్ జనరల్ మార్క్ లామి అన్నారు.

- 8లో

న్యూస్‌రీల్

వట్టిగెడ్డ మిగులు జలాలు విడుదల



వట్టిగెడ్డ ప్రాజెక్టు గేటు నుంచి విడుదల చేసిన నీరు

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని ప్రధాన సాగునీటి వనరైన వట్టిగెడ్డ ప్రాజెక్టు నుంచి మంగళవారం ఒక గేటు ద్వారా 300 క్యూసెక్కుల నీటిని కిందికి విడుదలచేసినట్టు ఏఈఈ బి.శంకరరావు తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 399 అడుగులు కాగా, ఇప్పటికే 398 అడుగుల నీటి మట్టం ఉందని ఆయన తెలిపారు. ఈ ఏడాది రైతులకు అవసరమైన సాగునీరు అందుతుందన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు



తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న జేసీ యశ్వంత్‌కుమార్ రెడ్డి

గరుగుబిల్లి: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. గరుగుబిల్లి మండలం పెద్దూరు గ్రామంలోని రైతు సేవా కేంద్రాన్ని, గరుగుబిల్లి గ్రామాల్లోని పంట పొలాలను మంగళవారం పరిశీలించారు. ఈ–క్రాప్ నమోదు ప్రక్రియపై ఆరా తీశారు. ఈ–క్రాప్‌లో పంటల నమోదువల్ల పంటల బీమా వర్తిస్తుందన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైతే నోటీసులు జారీ చేసి చర్యలు చేపట్టాలని తహసీల్దార్ బాలను ఆదేశించారు. కార్యక్రమంలో వీఆర్వో కరుణాకర్, కార్యదర్శి బి.అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

కనీస వేతనం చెల్లించండి

- రాష్ట్ర అధ్యక్షుడు బసవరాజు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు బసవరాజు

విజయనగరం ఫోర్ట్: రాష్ట్ర వ్యాప్తంగా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ (102)లో పనిచేస్తున్న సిబ్బందికి కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బసవరాజు, దేవిప్రసాద్ డిమాండ్ చేశారు. విజయనగరంలోని యూనియన్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. పదేళ్లుగా పనిచేస్తున్నా కేవలం రూ.10వేలు వేతనం చెల్లించడం తగదన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు రమణ, పోలిరాజు, నాయుడు, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు సిరిమాను చెట్టుకు పూజలు

గంట్యాడ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవంలో భాగంగా గంట్యాడ మండలం కొండ తామరపల్లిలో సిరిమాను చెట్టును గుర్తించారు. దీనికి ముహూర్తం ప్రకారం బుధవారం ఉదయం 9.15 గంటలకు సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు బొట్టుపెట్టు కార్యకమం నిర్వహిస్తారు. చెట్టుకు ప్రత్యేక పూజలు చేస్తారు.

విజయనగరంలో ఎన్‌ఐఏ సోదాలు

విజయనగరం క్రైమ్: ఉగ్రవాద భావజాలంతో అరెస్టయిన విజయనగరం జిల్లా కేంద్రంలోని ఆబాద్‌వీధికి చెందిన సిరాజ్ ఉర్ రెహ్మాన్ కేసులో నేషనల్ ఇన్వెస్టిగేషన్ అథారిటీ(ఎన్‌ఐఏ) బృందం దేశవ్యాప్తంగా 8 రాష్ట్రాల్లోన్ని 16 చోట్ల మంగళవారం ఏకకాలంలో సోదాలు జరిపింది. అందులో భాగంగా విజయనగరం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విచారణ చేపట్టింది. సిరాజ్‌కు సంబంధించిన పలు అంశాలపై జిల్లా పోలీస్ అధికారులను ప్రశ్నించింది. ఈ ఏడాది మే నెలలో ఎన్‌ఐఏ బృందం నగరంలోని ఆబాద్ వీధికి చెందిన సిరాజ్‌ను అదుపులో తీసుకోవడం, ఆ తర్వాత స్థానిక పోలీసులు వారం రోజుల పాటు కస్టడీకి తీసుకుని విచారణ జరిపిన తర్వాత కోర్టులో హాజరుపర్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం విశాఖ సెంట్రల్ జైల్‌లో ఉంటున్న ఉగ్రవాది సిరాజ్ నుంచి ఎన్‌ఐఏ అధికారులు ఇప్పటికే వివరాలు రాబట్టారు.

వైద్య విద్యపై ప్రైవేటు



- ప్రైవేటుకే ప్రభుత్వ వైద్య కళాశాల
- పేదల ఆరోగ్యంతో కూటమి చెలగాటం
- ముడుపుల కోసం కక్కుర్తి

సాక్షి, పార్వతీపురం మన్యం: తమ బిడ్డలను డాక్టర్ చదివించాలని తల్లిదండ్రులు కలలుగంటారు. ఆ కల అందరికీ నెరవేరదు. వైద్య విద్యకు రూ.కోట్లలో ఖర్చు చేయాల్సి రావడమే అందుకు కారణం. పార్వతీపురం మన్యం వంటి వెనుకబడిన జిల్లాలో, ఏజెన్సీ ప్రాంతంలో పేదలకు మెరుగైన వైద్యం అందని ద్రాక్షగానే మిగులుతోంది. వైద్యం కూడా ఖరీదు కావడమే ఇందుకు కారణం. అటు పేద పిల్లలకు వైద్య విద్యను చేరువ చేయడం.. ఇటు నిరుపేదలకు కూడా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సేవలను అందుబాటులోకి తీసుకురావాలన్న సదుద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జిల్లాకు ఒక ప్రభుత్వ వైద్య కళాశాలకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగానే పార్వతీపురం మన్యం జిల్లాలో కూడా రూ.600 కోట్లతో వైద్యకళాశాల నిర్మాణానికి పరిపాలనాపరమైన ఆమోదం లభించింది. కురుపాం నియోజక వర్గం ఉల్లిభద్రలో 50 ఎకరాల స్థలాన్ని కూడా అప్పట్లో పరిశీలించారు. తర్వాత ప్రభుత్వం మారడంతో సీన్ మొత్తం రివర్స్ అయ్యింది.

చిన్నపాటి సమస్యకూ కేజీహెచ్‌నే దిక్కు

జిల్లాలో 99 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బడుగు వర్గాలకు చెందివారే. ఇక్కడ ప్రధాన ఆస్పత్రితోపాటు, మూడు ఏరియా ఆస్పత్రులు, 37 పీహెచ్‌సీలు, మూడు సీహెచ్‌సీలు ఉన్నాయి. ఒక్క జిల్లా ఆస్పత్రిలోనే రోజుకు 500కుపైగా ఓపీ నమోదవుతోంది. పీహెచ్‌సీల్లోనూ 200 నుంచి 300 వరకు ఓపీ ఉంటోంది. అత్యవసర పరిస్థితుల్లో జిల్లా ఆస్పత్రి ఒక్కటే దిక్కవుతోంది. అక్కడ కూడా కొన్ని రకాల సేవలు అందడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో విజయనగరం, విశాఖ ప్రాంతాలకు రోగులు వెళ్తున్నారు. సరైన సదుపాయాలు లేక, చిన్నపాటి కేసులను కూడా వైద్యులు ప్రైవేట్ ఆస్పత్రులకు, విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేస్తున్నారు. ఇది రోగులకు, వారి బంధువులకు వ్యయ ప్రయాసలతో కూడుకున్న పని. అంత దూరం వెళ్లేలోగా మార్గమధ్యంలో ప్రాణాలు గాలిలో కలసిపోతున్న సందర్భాలు అనేకం.

తమ బాధ్యత నుంచి తప్పుకుని, ప్రైవేటుకు..

పేదలకు మెరుగైన వైద్యం, విద్య అందించాలన్న సంకల్పంతో నాటి ప్రభుత్వం మంజూరు చేసిన మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం పక్కనపెట్టేసింది. ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణం, నిర్వహణను పీపీపీ విధానంలో ప్రైవేటుకు అప్పగించేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగానే పార్వతీపురం మన్యం జిల్లాకు గత ప్రభుత్వం కేటాయించిన ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ టెండర్లను కూడా రద్దు చేసింది. దీనిపై అన్ని వర్గాల నుంచి సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. వాస్తవానికి గత ప్రభుత్వం రాష్ట్రంలో 17 కళాశాలలను మూడు దశల్లో పూర్తి చేయాలని భావించింది. అందులో మన్యం జిల్లా కూడా ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక.. తన బాధ్యత నుంచి తప్పుకొని.. పీపీపీ విధానంతో వైద్య కళాశాల ప్రైవేటీకరణకు పూనుకుంటున్నారు. ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తే బాగా నడుపుతారని సర్ది చెప్పుకుంటున్నారు. ప్రభుత్వం కాక, బయట వారికి నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తే.. పేదలకు ఉచిత విద్య, వైద్యం ఎలా అందిస్తారన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇది కేవలం ముడుపులకు ఆశ పడి, మెడికల్ మాఫియాను ప్రోత్సహించడం కోసమే అన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వ విధానం ప్రకారం.. వైద్య విద్యను అందించి డాక్టర్లను తయారు చేయడమే కాదు.. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సేవలు జిల్లా వాసులకు ఉచితంగా అందించడం. పేద విద్యార్థులకు ఉచిత వైద్య విద్య అందుతుంది.

ఎంతో ఉపయోగం ఉన్నా....

ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణమైతే ఇక్కడే సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుతాయి. మన్యం జిల్లాలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేస్తే ఇటు జిల్లాతో పాటు, అటు ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. పేద విద్యార్థులు, గిరి పుత్రులకు వైద్య విద్య అందుబాటులోకి వస్తుంది. అనుబంధంగా నర్సింగ్ కళాశాల, సిబ్బంది భవనానికి అవసరమైన భవనాలు వస్తాయి. వైద్యులు, వైద్య సిబ్బంది సంఖ్య పెరుగుతుంది. ఎంఆర్, సీటీ స్కాన్, డిజిటల్ ఎక్స్‌రే వంటి అధునాతన పరికరాలు అందుబాటులో ఉంటాయి. పల్మనాలజీ, న్యూరో ఫిజీషియన్, న్యూరో సర్జన్, పెథాలజీ, నెఫ్రాలజీ వంటి వైద్యులు 24 గంటలూ అందుబాటులో ఉంటారు. ఈ వైద్యసేవలన్నీ ప్రజలకు ఉచితంగానే అందుతాయి. ఇవే సేవలను ప్రైవేట్ భాగస్వామ్యంతో చేస్తే పేద రోగులకు మళ్లీ వ్యయ ప్రయాసలే మిగులుతాయి. ప్రైవేటుకు కట్టబెట్టాలన్న కూటమి నిర్ణయంతో ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణం కలగానే మిగిలిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అంతా సక్రమంగా జరిగితే 2025–26 సంవత్సరంలో వైద్య కళాశాల సేవలు అందుబాటులోకి రావాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం వైఖరిని వైఎస్సార్ సీపీ నాయకులు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఉద్యమానికి సిద్ధం అవుతున్నారు.

స్వయం సంపాదన మార్గాల పెంపునకు భరోసా



మనుమకొండలో గిరిజనులతో చర్చిస్తున్న పాలకొండ సబ్‌కలెక్టర్ స్వప్నిల్ జగన్నాథ్

భామిని: గిరిజనుల స్వయం సంపాదన మార్గాలు పెంచేందుకు కృషిచేస్తానని పాలకొండ సబ్‌కలెక్టర్, సీతంపేట ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ తెలిపారు. నీతి ఆయోగ్ ఆశావాహ గ్రామంగా ఎంపికైన భామిని మండలంలోని మనుమకొండ ఆదివాసీ గ్రామాన్ని మంగళవారం సందర్శించారు. గిరిజనుల సమస్యలపై చర్చించారు. మహిళలకు పుట్టగొడుగుల పెంపకం, పురుషులకు చేపల పెంపకంపై అవగాహన కల్పిస్తామన్నారు. వీడీవీకేల్లో తయారుచేసే పసుపు, పేపర్ ప్లేట్లకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామని చెప్పారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం సందర్శించి చిన్నారులతో ముచ్చటించారు. భామిని ఏకలవ్య మోడల్ స్కూల్‌ను సందర్శించి విద్యార్థుల సమస్యలపై ఆరా తీశారు. ఈఎంఆర్‌ఎస్ చుట్టూ ప్రహరీ నిర్మించాలని ఈఈ రమాదేవిని ఆదేశించారు. బత్తిలి పీహెచ్‌సీని సందర్శించి ప్రసవ సేవల తీరును వైద్యులు కొండపల్లి రవీంద్ర, దామోదరరావులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఐటీడీఏ ఏపీఓ చిన్నబాబు, ఈఈ రమాదేవి, డీడీ అన్నదొర, ఎంపీడీఓ రజినీకాంత్, తహసీల్దార్ శివన్నారాయణ, ఏఈ అలికాన సందీప్, సీడీపీఓ శాంతిభవానీ ఉన్నారు.



బత్తిలి పీహెచ్‌సీ పరిసరాలను పరిశీలిస్తున్న స్వప్నిల్ జగన్నాథ్

రామతీర్థంలో ప్రారంభమైన పవిత్రోత్సవాలు



పట్టు పవిత్రాల ఊరేగింపులో అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామివారి దేవస్థానంలో పవిత్రోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఏటా ఆలయంలో భాద్రపద బహుళ దశమి నుంచి త్రయోదశి వరకు పవిత్రోత్సవాలను వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా జరిపించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో పవిత్రోత్సవాలకు అర్చకులు శ్రీకారం చుట్టారు. వేకువజామున ప్రాతఃకాలార్చన, బాలభోగం, యాగశాలలో సుందరకాండ హవనం, తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయంలోని వెండి మండపం వద్ద స్వామికల్యాణాన్ని వైభవంగా జరిపించారు. సాయంత్రం 6 గంటలకు విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం పూజలు చేశారు.

● ఓజోన్‌తో సేఫ్ జోన్..



ఓజోన్ పరిరక్షణతో భూమి మీద నివసించే సమస్త జీవరాశులు సేఫ్‌జోన్‌లో ఉంటాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఓజోన్ దినోత్సవం సందర్భంగా ఓజోన్ పొరవల్ల మానవాళికి కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు తెలియజేశారు. ఓజోన్ ఫార్ములా ఓ3 ఆకారంలో విద్యార్థులను కూర్చోబెట్టి చైతన్యం కలిగించారు. వీరఘట్టం మండలం తలవరం హైస్కూల్ విద్యార్థుల ఓజోన్ ఆకారాన్ని చిత్రంలో చూడొచ్చు.

– వీరఘట్టం

● భారీ వర్షం



విజయనగరం జిల్లా కేంద్రంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. గంటస్తంభం, పాతబస్టాండ్ రోడ్డులో నీరు చేరడంతో తోపుడుబళ్లు, చిరు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు.

– సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం



సీతంపేట: రణభేరి జాతాలో ఉపాధ్యాయులు

సీతంపేట/కురుపాం: ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆర్థికపరమైన సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటం ఆగదని యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు సంపతిరావు కిశోర్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్, కోశాధికారి రెడ్డి మోహన్‌రావు స్పష్టంచేశారు. యూటీఎఫ్ రెండోరోజు రణభేరి బైక్‌జాతాను సీతంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కురుపాం మండంలోని నీలకంఠాపురంలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఆర్‌సీ కమిషన్‌ను వెంటనే నియమించి ఐఆర్ ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 4 డీఏలు, పీఆర్‌సీ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు డి.ప్రకాషరావు, ఆరిక భాస్కరరావు, కె.కృష్ణారావు, పి.కృష్ణారావు, పైడిరాజు, ఎస్.శ్రీరాములు, బి.కూర్మారావు, తదితరులు పాల్గొన్నారు.



కురుపాంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్

డీఎస్సీలో రాణించిన క్రీడాకారులు

విజయనగరం: ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో రాష్ట్రానికి చెందిన 15 మంది పారా క్రీడాకారులు ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కె.దయానంద్ తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన మంగళవారం మాట్లాడారు. ఈ విజయంతో దివ్యాంగ క్రీడాకారుల ఆత్మగౌరవం మరింతగా పెరిగిందన్నారు. రాష్ట్రంలో పారా క్రీడల అభివృద్ధికి గత పదేళ్లుగా నిరంతరం కృషిచేస్తున్న పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు గోనుగుంట్ల కోటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వి.రామస్వామికి కృతజ్ఞతలు తెలిపారు.

పాలకొండలో దౌర్జన్యకాండ



ఎంపీడీఓ కార్యాలయం వద్ద బైఠాయించేందుకు ప్రయత్నిస్తున్న విక్రాంత్‌ను అడ్డుకుంటున్న పోలీసులు



ఎంపీడీఓ కార్యాలయం గేటు బయటే ఉండిపోయిన మండల పరిషత్ సభ్యులు

- మండల సమావేశానికి వెళ్లకుండా ఎమ్మెల్సీ విక్రాంత్, సభ్యులను అడ్డుకున్న పోలీసులు
- నిరంకుశ పాలనపై సభ్యుల మండిపాటు

పాలకొండ/పాలకొండ రూరల్: కూటమి ప్రభుత్వం అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని పక్కనపెట్టి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోంది. అరాచక పాలనకు తెరలేపింది. పోలీసులతో దౌర్జన్యకాండను కొనసాగిస్తోంది. దీనికి పాలకొండ మండల సర్వసభ్య సమావేశానికి ప్రతిపక్ష సభ్యులను రానీయకుండా పోలీసులతో మంగళవారం సాగించిన దౌర్జన్యమే నిలువెత్తు నిదర్శనం. పాలకొండ మండల సర్వసభ్య సమావేశానికి హాజరుకావాలంటూ ఈ నెల 6వ తేదీన ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌తోపాటు ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు అధికారంగా ఆహ్వానం పంపించారు. జెట్పీటీసీ పాలవలస గౌరీపార్వతి, వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు, పలువురు సర్పంచ్‌లతో పాటు ఎమ్మెల్సీ విక్రాంత్ సమావేశానికి హాజరయ్యేందుకు బయలుదేరారు. ఎంపీడీఓ కార్యాలయంలోకి వెళ్తుండగా గేటువద్దనే ఎమ్మెల్సీని డీఎస్పీ రాంబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీస్ బలగాలు అడ్డుకున్నాయి. ఆహ్వానం మేరకే వచ్చానని ఎమ్మెల్సీ తెలియజేసినా ససేమిరా అన్నారు. జీడీఏ నుంచి తనకు వచ్చిన అనుమతి కాపీని పోలీసులకు చూపించినా వినిపించుకోలేదు. ఎంపీడీఓ అనుమతి ఇస్తేనే లోపలకు పంపిస్తామని డీఎస్పీ రాంబాబు స్పష్టం చేశారు. లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించిన విక్రాంత్‌ను నెట్టేశారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లను సైతం గంటల తరబడి గేటువద్దనే నిలిపేశారు. పోలీసులు, అధికారుల తీరును నిరసిస్తూ సభ్యులు గేటు వద్దనే బైఠాయించి రాజ్యాంగంలోని నిబంధనలు పాటించాలంటూ డిమాండ్ చేశారు. జీడీ నుంచి వచ్చిన జీఓను అమలు చేయాలని కోరారు. ఆహ్వానం ఎందుకు పంపారో వివరణ ఇవ్వాలంటూ పట్టుబట్టారు. దీంతో ఎంపీడీఓను డీఎస్పీ పిలిపించి ఆహ్వానం పంపింది మీరే కదా... ఇప్పుడు ఎందుకు సమావేశానికి రానీయకుండా తమతో అడ్డగించారని ప్రశ్నించారు. దీనిపై ఆయన నీళ్లు నములుతూ పనిఒత్తిడిలో ఆహ్వానం పంపించేశానని, ఎమ్మెల్సీకి ఏ మండలంలో ఓటు హక్కు ఉంటే ఆ మండల సమావేశానికి మాత్రమే హాజరుకావాలని లిఖితపూర్వకంగా తెలియజేశారు. దీంతో అక్కడ నుంచి విక్రాంత్‌తో పాటు సభ్యులు వెనుదిరిగారు. అనంతరం ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణతో పాటు పార్టీ కార్యకర్తలతో మండల సమావేశాన్ని మమ అనిపించారు. సభ్యులు కానివారితో సమావేశం నిర్వహిస్తే ప్రజలకు ఏం మేలు జరుగుతుందంటూ మండల వాసులు మండిపడ్డారు.



జీడీఏ నుంచి సమావేశానికి అనుమతించాలని అందిన లేఖను చూపిస్తున్న విక్రాంత్

న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తా...

యూరియా అందించలేని స్థితిలో ప్రభుత్వం ఉందని, చాలామంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం, విద్యార్థులకు తల్లికివందనం అందలేదని, వీటిపై నిలదీస్తామన్న భయంతోనే సమావేశానికి రాకుండా అడ్డుకున్నారని ఎమ్మెల్సీ విక్రాంత్ ఆరోపించారు.

అధికారులను కూటమి నాయకులు బలిపశువులను చేస్తున్నారని, ఈ ఘటనపై న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో పాటు పెద్దల సభలో ప్రస్తావిస్తానన్నారు.

సర్పంచ్‌లను ఎందుకు అడ్డుకున్నారు



గ్రామాల్లో సమస్యలు పేరుకుపోయాయి. వాటిని ప్రశ్నించాల్సిన వేదిక మండల సమావేశం ఒక్కటే. అక్కడికి కూడా రానీయకుండా పోలీసులను పెట్టి అడ్డుకున్నారు. అసలు ప్రజాసామ్యంలోనే మనం ఉన్నామా? అన్న సందేహం కలుగుతోంది.

– టి.నీరజ, సర్పంచ్, నవగాం

అంత భయమెందుకు?



మండల సమావేశంలో సమస్యలపై ప్రస్తావిస్తే కూటమి నాయకులు అవినీతి బయట పడుతుందని భయపడుతున్నారు. అందుకే అధిక సంఖ్యలో ఉన్న వైఎస్సార్‌సీపీ సభ్యులను సమావేశానికి రాకుండా అడ్డుకున్నారు. మండలానికి వచ్చిన నిధులు అభివృద్ధికి కాకుండా వారి ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారు.

– కనపాక సూర్యప్రకాష్‌రావు, వైస్ ఎంపీపీ

క్లుప్తంగా

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి


సతీష్ (ఫైల్)

పూసపాటిరేగ: మండలకేంద్రం పూసపాటిరేగలోని సినిమాహాల్ సమీపంలో వాటర్ సర్వీసింగ్ పాయంట్‌లో వాహనాలకు వాటర్ సర్వీస్ చేస్తుండగా వాటర్ గన్‌కు విద్యుత్ సరఫరా కావడంతో షాక్ తగిలి ఓ వర్కర్ అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే వెంపడాం గ్రామానికి చెందిన దుక్క సతీష్ (29)వాటర్ సర్వీస్‌పాయింట్‌లో వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం ఉదయం వాటర్ సర్వీస్ చేస్తుండగా గన్‌కు నాజల్ మార్చే ప్రయత్నంలో విద్యుత్ సరఫరా కావడంతో షాక్ తగిలి మృతిచెందాడు. మృతుడికి భార్య సుప్రియ ఉంది. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించి పూసపాటిరేగ ఎస్సై ఐ.దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ అంగన్‌వాడీ కార్యకర్త..


రాజేశ్వరి (ఫైల్)

గంట్యాడ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన అంగన్వాడీ కార్యకర్త చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మండలంలోని దిగువ కొండపర్తి పంచాయతీ భీమవరం గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త కె.రాజేశ్వరి(36) ఈనెల 12న గంట్యాడలో జరిగిన ఐసీడీఎస్ సమావేశానికి హాజరైంది. సమావేశం ముగిసిన తర్వాత తిరిగి భర్తతో కలిసి బైక్‌పై ఇంటికి వెళ్తుండగా తామరాపల్లి జంక్షన్ వద్ద గాలికి చీర బైక్ చక్రాల్లో చిక్కుకు పోవడంతో ప్రమాదవశాత్తు రోడ్డుపై పడిపోగా స్థానికులు 108లో చికిత్స నిమిత్తం విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు.అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికృష్ణ తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి..

సీతానగరం: మండలంలోని కాశీపేట గ్రామం పరిధిలో బొబ్బిలి సీతానగరం రైల్వే స్టేషన్ మధ్య ఒడిశాలోని జయపురం గ్రామానికి చెందిన గుప్త మజ్జి (27) రైలు నుంచి జారి పడి మంగళవారం మృతిచెందాడు. ఈ మేరకు జీఆర్పీ హెచ్‌సీ బి.ఈశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లో ప్రయాణిస్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తు జారి పడి పోయినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేశారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని మండ గ్రామానికి చెందిన ఆరిక ధర్మారావు అనే యువకుడు మంగళవారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ క్రమంలో నోటి నుంచి నురగలు కక్కుతూ కన్పించిన ధర్మారావును గమనించిన కుటుంబసభ్యులు భద్రగిరి సామాజిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. ఇంట్లో తండ్రికి కొంతకాలంగా అనారోగ్యంగా ఉండడం, చికిత్స చేయిస్తున్నప్పటికీ తగ్గకపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు యత్నించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

రైళ్లలో దొంగకు ఐదు నెలలు జైలు

విజయనగరం క్రైమ్: రైళ్లలో దొంగతనాలకు పాల్పడిన నిందితుడు శరత్ దిగాల్‌కు విశాఖ రైల్వే కోర్ట్ జడ్జి కార్తీక్ ఐదు నెలల 15 రోజులు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారని విజయనగరం గవర్నమెంట్ రైల్వే పోలీస్ ఎస్సై బాలాజీరావు మంగళవారం తెలిపారు. ఏడాది కాలం నుంచి రైళ్లలో ప్రయాణించే వారిని లక్ష్యంగా చేసుకుంటూ నిందితుడు శరత్ దిగాల్ చోరీలకు పాల్పడేవాడన్నారు.ఇటీవల రైలులో ఓ ప్రయాణికుడి నుంచి సెల్ ఫోన్ చోరీకి యత్నించగా పట్టుకున్నామని తెలిపారు. ఒడిశా రాష్ట్రంలోని కొంధమాల్ జిల్లా జి. ఉదయగిరి మండలం, హత్తిబాలిసాహికి చెందిన శరత్ దిగాల్‌ను అరెస్ట్ చేసి సెల్ ఫోన్ రికవర్ చేసి కోర్టులో ప్రవేశ పెట్టామని చెప్పారు. ఏపీపీ శంకరరావు సాక్ష్యాలను ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో రైల్వే కోర్టు జడ్జి పై విధంగా శిక్ష విధించినట్లు వివరించారు.

గణిత ఉపాధ్యాయ పోస్టు భర్తీకి ఆహ్వానం

శృంగవరపుకోట: మండలంలోని తాటిపూడిలో గల గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో తాత్కాలిక ప్రాతిపదికన గణితం బోధనకు మహిళా అభ్యర్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శారదాబాయి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థులు ఈనెల 20వ తేదీ సాయంత్రం 4గంటల లోగా తమ దరఖాస్తులను కళాశాలలో అందించాలని, అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పీజీలో 50శాతం మార్కులు సాధించిన వారై ఉండాలని ఆమె పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 8712625071 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹150	₹270	₹280

స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్‌కు సిద్ధం

- సన్నద్ధమవుతున్న 6 నుంచి 10 తరగతుల విద్యార్థులు


జీఎల్ పురం కేజీబీవీ విద్యార్థులు రూపొందించిన వర్షపునీటితో విద్యుత్ తయారీ ప్రాజెక్టు (ఫైల్)



ఐదు ప్రాజెక్టులు గుర్తింపు పొందడంతో నాడు జిల్లా సొంతం చేసుకున్న ప్రశంసా పత్రం

పాలకొండ రూరల్: విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న సజనాత్మకను వెలికి తీసి వారి ఆలోచనలకు పదునుపెట్టే వేదిక స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్. భారత దేశంలో విద్యార్థులకు సంబంధించి అతిపెద్ద చాలెంజ్ కార్యక్రమం (స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్) అని జిల్లా విద్యాశాఖ చెబుతోంది. దీనిని మినిస్ట్రీ అఫ్ ఎడ్యుకేషన్, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్, నీతి అయోగ్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఈ వేదికపై తలపడేందుకు జిల్లా పరిధిలో 6–10 తరగతుల మధ్య బోధన పొందుతున్న అన్ని మేనేజ్‌మెంట్లకు చెందిన విద్యార్థులు సిద్ధం కావాలని విద్యాశాఖ జిల్లా యంత్రాంగం సూచిస్తోంది. ఈ ఏడాది జూలై 28న ప్రారంభమైన ఈ కార్యక్రమంలో విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఈ నెల 23లోగా దరఖాస్తు చేయాలి. అటుపై నవంబర్ లోగా విద్యార్థులు వారి స్కిల్స్‌కు పదునుపెట్టి నవంబర్ 30వ తేదీకి వారి ప్రాజెక్ట్‌ను సబ్‌మిట్ చేయాలి. 2026 జనవరిలో దేశవాప్తంగా వచ్చిన ప్రాజెక్టుల ఎంపిక జరుగుతుంది. ఆదే ఏడాది మార్చిలో ఎంపికైన తొలి 200 ప్రాజెక్టులకు ఆర్థిక ప్రోత్సాహం, ఏప్రిల్ నుంచి జూలై వరకు ఎంపికైన విద్యార్థులకు ఇంటర్న్‌షిప్, అదే నెల 29 ప్రాజెక్టుల ప్రదర్శన ఉంటుంది.

రూ.లక్ష నుంచి సహకారం..

- దేశవ్యాప్తంగా వచ్చిన పరిష్కారాలలో అత్యంత ప్రతిభ కలిగి ఎంపికైన తొలి 200 ప్రాజెక్ట్‌లకు మినిస్ట్రీ అఫ్ ఎడ్యుకేషన్ వారు ప్రోటోటైప్ చేయడానికి కావాల్సిన ఆర్థిక సహకారం రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు అందిస్తారు.
- టాప్ 200 టీమ్స్‌కు ప్రోటోటైప్ చేయడానికి కావాల్సిన సాంకేతిక సహకారాన్ని నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సమకూరుస్తుంది.

ఆలోచనలకు పెద్దపీట



విద్యార్థుల ఆలోచనలకు మారథాన్ పెద్దపీట వేస్తోంది. గత ఏడాది జాతీయ స్థాయిలో మన విద్యార్థులు రూపొందించిన 5 ప్రాజెక్టులు గుర్తింపు పొందాయి. అదే స్ఫూర్తితో ఈ ఏడాది మరిన్ని ఫలితాలు సాధించాలి. తొలి 200 ప్రాజెర్టుల్లో స్థానం పొందేలా ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాల్సి ఉంటుంది. అప్పుడే సంబంధిత ఆర్థిక సాయం పొందవచ్చు. జిల్లా నుంచి అత్యధిక ఐడియాలను సిద్ధంచేసి సబ్‌మిట్ చేయాలి. ప్రతి పాఠశాల నుంచి పది టీమ్‌లను సైన్స్, గణిత ఉపాధ్యాయులు సిద్ధం చేయాల్సి ఉంటుంది.

– బి.రాజ్‌కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి, పార్వతీపురం మన్యం

లక్ష్యం ఇలా..

- ముఖ్యంగా పాఠశాల ఉపాధ్యాయులు స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ గురించి తెలుసుకుని ఆన్‌లైన్ పోర్టల్‌లో ముందుగా రిజిస్టర్ కావాలి.
- రెండవ దశలో విద్యార్థులకు స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ గురించి అవగాహన కల్పించి, ఆసక్తి గల విద్యార్థులను బృందాలుగా విభజించాలి. వారితో (https://schoolinnovationmarathon.org/registration) లింక్‌లో ఈనెల 23నాటికి ఆన్‌లైన్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించాలి.
- మూడవ దశలో సమాజం ప్రస్తుతం ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను విద్యార్థులు అర్థం చేసుకుని వాటిలో ఒక సమస్యను ఎంచుకోవాలి. దీనికి సంబంధించిన ప్రాబ్లమ్ స్టేట్‌మెంట్ రాయాల్సి ఉంటుంది.
- ఎంచుకున్న సమస్యకు సజనాత్మకతో కూడిన పరిష్కారం చూపడం, దానికి సంబంధించిన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదుచేయాలి.
- అత్యంత ప్రతిభావంతమైన తొలి 200 ఐడియాలలో మన ప్రాజెక్ట్ ఎంపికై తే దానిని ప్రోటోటైప్ చేసి పేటెంట్ పొందవచ్చు.

2024లో..

గత ఏడాది స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్‌లో అత్యధికంగా టీచర్స్, స్టూడెంట్స్‌లను రిజిస్ట్రేషన్ చేసి రాష్ట్రంలో పార్వతీపురం మన్యం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. దేశావ్యాప్తంగా లక్ష ఐడియాలు రిజిస్టర్ అయ్యాయి. ప్రాధాన్యత గల తొలి వెయ్యి ప్రాజెక్టుల్లో జిల్లాకు చెందిన 5 ప్రాజెక్టులకు గుర్తింపు లభించింది.

భారత్‌తో భాగస్వామ్యానికి ఫ్రాన్స్ ఆసక్తి

- ఫ్రాన్స్ కాన్సులేట్ జనరల్ మార్క్ లామి


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఫ్రాన్స్ కాన్సులేట్ జనరల్ మార్క్ లామి

నెల్లిమర్ల రూరల్: భారత్‌తో విద్యా భాగస్వామ్యానికి ఫ్రాన్స్ దేశం ఆసక్తి చూపిస్తోందని ఆ దేశం కాన్సులేట్ జనరల్ మార్క్ లామి అన్నారు. ఈ మేరకు నెల్లిమర్ల మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వవిద్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఫ్రాన్స్ దేశం వివిధ విద్యా సంస్థలతో నైపుణ్యాల పెంపుదలకు కృషి చేస్తోందన్నారు. ఫ్రాన్స్‌కు చెందిన కంపెనీలు భారత్‌లో విద్యార్థులకు ఉన్నత ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయని చెప్పారు. భారత్‌లో ఫ్రాన్స్ రాయబార కార్యాలయాలు, ఇండో ఫ్రాన్స్ చాంబర్ ఆఫ్ కామర్స్ కంపెనీలు అత్యంత సన్నిహితంగా పనిచేస్తున్నాయన్నారు. భారతీయులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. 15 ఫ్రెంచ్ కంపెనీలు ఏపీ, ఇతర రాష్ట్రాల్లో పెట్టుబడులు పెడుతున్నాయని, నైపుణ్యం కలిగిన యువతకు అతి తక్కువ సమయంలోనే మరిన్ని అవకాశాలను సృష్టిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఫ్రెంచ్ కంపెనీ డస్సాల్ట్ సిస్టమ్స్‌తో సెంచూరియన్ వర్సిటీ భాగస్వామ్యం ప్రశంసనీయమన్నారు. విద్యా బోధనలో భాగంగా సెంచూరియన్ విశ్వ విద్యాలయం నైపుణ్యాలను జోడించడం, విద్యాభివృద్ధికి వివిధ కార్యక్రమాలను అమలు చేయడం అభినందించదగ్గ విషయమని చెప్పారు. అనంతరం వివిధ ల్యాబ్‌లను సందర్శించి జీటీఎం ల్యాబ్, వెల్‌నెస్ సెంటర్, త్రీడీ డేటా సెంటర్, బ్రీడింగ్ ల్యాబ్‌లను ప్రారంభించారు. కార్యక్రమంలో సెంచూరియన్ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డీఎన్ రావు, చాన్స్‌లర్ జీఎస్ఎన్ రాజు, వీసీ ప్రశాంత కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, ఐక్యూఏసీ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త మృతి

- సంతాపం తెలియజేసిన మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర


గణేశ్వరరావు భౌతికాయం వద్ద సంతాపం తెలియజేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

పాచిపెంట: మండలంలోని పాంచాలి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త కేతవరపు గణేశ్వర రావు(80) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఉప ముఖ్య మంత్రి పీడికరాజన్నదొర పాంచాలి గ్రామానికి వెళ్లి గణేశ్వరరావు భౌతికాయాన్ని దర్శించి సంతాపం తెలియజేశారు. మతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. రాజన్న దొర వెంట వైఎస్సార్‌సీపీ మండల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

సీతానగరం: వీకే యూనివర్సిటీ ఫ్యామిలీ ఫౌండేషన్, కెనరాబ్యాంక్ సౌజన్యంతో సమకూర్చిన ఆర్థిక సహాయంతో మరిపివలస ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇద్దరికి రెండు సైకిళ్లను పంపిణీ చేశామని హెచ్ఎం బి విజయలక్ష్మి మంగళవారం తెలియజేశారు. అలాగే 8వ తరగతి చదువుతున్న మర్రి వైష్ణవి, మరడాన జ్ఞానేశ్వరిలకు డిగ్రీవరకూ ప్రోత్సాహకంగా ఏడాదికి రూ.1000 వంతున వారి అకౌంట్‌లలో ఫ్యామిలీ ఫౌండేషన్, కెనరాబ్యాంక్ క్రెజీ బీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ వారు నగదు వేయనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్‌అసిస్టెంట్ ఆర్.శంకరరావు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి


ఆదినారాయణ(ఫైల్)


ప్రమాదంలో మృతిచెందిన ఆదినారాయణ

గరుగుబిల్లి: మండలంలోని గిజబ గ్రామానికి చెందిన మరడాన ఆదినారాయణ(65) సోమవారం రాత్రి నందివానివలస రహదారి పరిధిలో గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందారు. ఆదినారాయణ విశ్రాంత మిలటరీ ఉద్యోగి. ఉద్యోగ విరమణ అనంతరం సంతోషపురం పంచాయతీ ఖడ్గవలస జంక్షన్ పరిధిలో నయారా పెట్రోల్ బంక్‌ను నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి 10 గంటల సమయంలో బంక్‌నుంచి ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఆదినారాయణ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై ఫక్రుద్దీన్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించి మంగళవారం పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి భార్య మంగమ్మ, కుమార్తెలు దివ్య, చిన్ను ఉన్నారు.

అనుమానాస్పదంగా గుర్తు తెలియని వ్యక్తి..

కొత్తవలస: మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలో గల పీడబ్ల్యూ ఆఫీస్ వద్ద గుర్తు తెలియని 25 సంవత్సరాలు వయస్సు గల యువకుడి మృతదేహాన్ని స్థానికులు మంగళవారం గుర్తించారు.ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి వంటిపై తెలుపు రంగు ప్యాంట్ కాఫీ కలర్ నెక్క్ బనియన్ ఉన్నాయి. ముక్కు నుంచి రక్తం కారుతూ ఉండడాన్ని పోలీసులు గమనించారు. సదరు వ్యక్తి సోమవారం రైల్వే స్టేషన్‌లో గల ప్లాట్‌ఫామ్–1లో సంచరిస్తూ ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ముక్కు నుంచి రక్తం కారడంతో అనుమానాస్పదంగా మృతి చెంది ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. ఈ మేరకు రెవెన్యూ కార్యదర్శి లాలం రాధాకృష్ణ ఫిర్యాదుపై ఎస్సై జోగారావు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు.

ఆటోల బంద్ నేడు

విజయనగరం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సుల వల్ల నాలుగు లక్షల మంది ఆటోడ్రైవర్లు రోడ్డున పడ్డారని, ఈ మేరకు బుధవారం ఆటోల బంద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఏఐఎఫ్‌టీయూ నాయకుడు రెడ్డి నారాయణరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోట జంక్షన్ వద్ద ఉదయం 6 గంటల నుంచి బంద్ కొనసాగిస్తామని, భారీ ఎత్తున ర్యాలీ, గంటస్తంభం మీదుగా బాలాజీ కూడలి, ఆర్‌టీసీ కాంప్లెక్స్, మయూరి కూడలి వరకు ఉంటుందన్నారు. జీఓ నంబర్ 21 రద్దుచేయాలని, ఏడాదికి వాహన మిత్ర కింద డ్రైవర్లకు రూ.25వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బంద్‌లో ప్రతి ఆటో డ్రైవర్ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

చెక్ బౌన్స్ కేసులో జైలుశిక్ష

గజపతినగరం రూరల్: బొండపల్లి మండలంలోని గొట్లాం గ్రామానికి చెందిన శిడగం నాగరాజు వద్ద అంబటివలస గ్రామానికి చెందిన పాలూరు అప్పల నరసింహనాయుడు రూ.4లక్షల ఏభైవేలు అప్పుగా తీసుకుని తీర్చలేదు. ఈ క్రమంలో ఆయన ఇచ్చిన చెక్ బౌన్స్ అవ్వడంతో అప్పు ఇచ్చిన వ్యక్తి గజపతినగరం కోర్టును ఆశ్రయించగా అప్పు తీసుకున్న వ్యక్తికి రూ.9లక్షల జరిమానాతో పాటు రెండేళ్ల జైలుశిక్ష విధించినట్లు ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ విజయ్‌రాజ్‌కుమార్ తెలిపారు.

బైక్, ట్రాక్టర్ ఢీ: ఇద్దరికి గాయాలు

వంగర: మండల పరిధి చంద్రంపేట సమీపంలో బైక్, ట్రాక్టర్ ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయని ఎస్సై షేక్ శంకర్ తెలిపారు. ఈ నెల 15న కింజంగి గ్రామానికి చెందిన వేమిరెడ్డి మురళీకృష్ణ, వేమిరెడ్డి గణేష్‌రావులు విజయనగరం వెళ్లి తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని ట్రాక్టర్ అతివేగంగా వచ్చి ఢీకొట్టిందని చెప్పారు. వేమిరెడ్డి మురళీకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

నాగావళి తీరంలో కొనసాగుతున్న వెతుకులాట

- తన తల్లే అంటున్న రాజాం పట్టణవాసి పైడిరాజు


ఘటనా స్థలంలో గుర్తించిన పాదరక్షలు తన తల్లివేనని చెబుతున్న పైడిరాజు తదితరులు


నాగావళి తీరంలో కొనసాగుతున్న గాలింపు

పాలకొండ రూరల్: ఇటీవల నాలుగు రోజుల క్రితం పాలకొండ మండలం గొట్ట మంగళాపురం సమీపంలో గుర్తు తెలియని మహిళ వంతెనపై నుంచి నాగావళి నదిలో దూకేసింది. ఈ క్రమంలో అక్కడి స్థానికులు అందించిన సమాచారంతో పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లా పరిధిలో నదీతీర పరీవాహక మండలాల పోలీసులు మహిళను వెతుకులాడేందుకు దృష్టి పెట్టారు. పాలకొండ ఎస్సై కె.ప్రయోగమూర్తి, స్థానిక అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు నేతృత్వంలో ప్రత్యేక బృందాలు, ఈతగాళ్లు తీరం వెంబడి ఉన్న చిన మంగళాపురం, బొడ్డవలస, యరకారాపురం, గోపాలపురం, అన్నవరం, డొంకలపర్త, కిలంతర, సంకిలి తదితర ప్రాంతాల్లో గాలింపు చేపట్టినా మంగళవారం నాటికి కూడా ఎక్కడా మహిళ ఆచూకీ లభ్యం కాలేదని అధికారులు తెలిపారు. ఈ క్రమంలో మరింత క్షుణ్ణంగా పరిశీలన చేపడతామని అధికారులు పేర్కొంటున్నారు.

మా అమ్మే..!

ఇదిలా ఉండగా ఈ ఘటనలో నదిలో దూకిన మహిళకు సంబంధించి నిన్నటి వరకూ ఎటువంటి ఆచూకీ లభ్యం కాకపోగా కేవలం వంతెనపై పాదరక్షలను మాత్రమే అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో విజయనగరం జిల్లా రాజాం పట్టణ పరిధి మల్లయ్యపేటకు చెందిన కాకర్ల పైడిరాజు ఘటనాస్థలంలో అధికారులను ఆశ్రయించి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తన తల్లి పార్వతి(54) ఈనెల 13న శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి నుంచి వెళ్లి పోవడంతో తెలిసినవారిని వాకబు చేశామని, ఎక్కడ ఉన్నది తెలియకపోవడంతో ఆదివారం ఉదయం రాజాం పోలీసులకు ఫిర్యాదు చేసి, అటుపై నదిలో మహిళ దూకిన విషయం తెలుసుకుని ఘటనా స్థలానికి వచ్చామన్నారు. అధికారులు గుర్తించిన పాదరక్షలు తన తల్లివేనని ధ్రువీకరించారు. దీర్ఘకాల అనారోగ్య సమస్యతో ఇబ్బందులు పడుతున్న తన తల్లికి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. త్వరలో ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని వైద్యులు చెప్పినట్లు వివరించారు. కేవలం భయంతో ఆమె పని చేసి ఉండవచ్చని కుమారుడు పైడిరాజు చెబుతున్నాడు. విషయం తెలుసుకున్న అధికారులు మాట్లాడుతూ మృతదేహం లభ్యమైతే తప్ప ఈ విషయాన్ని నిర్ధారణ చేయలేమన్నారు.

కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయుల నిరసన


విజయనగరం అర్బన్: కలెక్టరేట్ ఎదుట నిరసన నినాదాలతో ఉపాధ్యాయులు


కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

పార్వతీపురం రూరల్: ఏపీటీఎఫ్ రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు వారం రోజుల నిరసనలో భాగంగా మంగళవారం పార్వతీపురం జిల్లాలో ఆ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయులు నిరసన వ్యక్తంచేశారు. ఈ నిరసనలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహేష్, నల్ల బాలకృష్ణరావు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు బకాయిపడిన కరువు భత్యాన్ని ప్రభుత్వం తక్షణమే చెల్లించాలి. అలాగే 12వ పీఆర్‌సీని నియమించాలి. ఉద్యోగులకు ఆరోగ్య పథకం ద్వారా చికిత్స చేయడానికి నగదు పరిమితిని రూ.25లక్షకు పెంచాలి. కంట్రిబ్యూటరీ పింఛన్ పథకాన్ని విధానంలోకి తీసుకురావాలని నూతనంగా ప్రవేశపెట్టిన అసెస్‌మెంట్ బుక్ విధానాన్ని రద్దుచేయాలని బోధనేతర కార్యక్రమాల నుంచి ఉపాధ్యాయులను మినహాయింపు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన మెమొరాండాన్ని డీఆర్‌ఓ కె.హేమలతకు అందజేశారు. కార్యక్రమంలో కొమరాడ, వీరఘట్టం, గరుగుబిల్లి, జియ్యమ్మవలస మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌ను విజయవంతం చేయాలి

- జిల్లావ్యాప్తంగా 339 ప్రత్యేక వైద్య శిబిరాలు

పార్వతీపురంటౌన్: మహిళల ఆరోగ్యం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా నిర్వహిస్తున్న స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాలను జిల్లాలో విజయవంతం చేయాలని వైద్యారోగ్యశాఖ జిల్లా అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు కోరారు. జిల్లాలో కార్యక్రమ పర్యవేక్షణకు విచ్చేసిన స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ పి. గీతాపద్మజతో కలిసి ప్రోగ్రాం అధికారులతో ఆరోగ్య కార్యాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా వైద్యాధికారులకు కార్యక్రమం నిర్వహణపై సూచనలు చేశారు. సెప్టెంబర్17 నుంచి అక్టోబర్ 2 వరకు స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కింద 339 ప్రత్యేక వైద్య శిబిరాలను జిల్లాలో అన్ని ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిర్వహించనున్నామన్నారు. శిబిరంలో14 కౌంటర్లను ఏర్పాటు చేసి అక్కడ నిర్దేశించిన ఆరోగ్య పరీక్షలు, వైద్య సేవలు అందజేయాలని సూచించారు. ఇందుకు షెడ్యూల్ ప్రకారం నియమించిన స్పెషలిస్ట్ వైద్యులు, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది ముందుగా అక్కడ సిద్ధంగా ఉండాలన్నారు. వైద్యశిబిరంలో దీర్ఘకాలిక వ్యాధులు బీపీ, షుగర్, కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, మహిళలు, కిశోరీ బాలికల్లో రక్తహీనత గుర్తించే పరీక్షలు, గర్భిణులకు వైద్య పరీక్షలు, పోషకాహార ఆవశ్యకత,ఆరోగ్య జాగ్రత్తలపై కౌన్సెలింగ్, క్షయ నిర్ధారణ పరీక్షలు, నిక్షయ్ మిత్రల నమోదు, సికిల్ అనీమియా పరీక్షలు, పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు, బహిష్టు పరిశుభ్రతపై అవగాహన, ఆయుష్మాన్ ఆరోగ్య కార్డుల అందజేత తదితర వైద్య సేవలందించాలని చెప్పారు. అందరినీ సమన్వయం చేసుకుంటూ షెడ్యూల్ ప్రకారం అక్టోబర్2 వరకు ఆయా పరిధిలో కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని, ప్రజలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డా.పద్మావతి, డీఐఓ విజయ మోహన్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి.జగన్మోహనరావు, డా రఘు, డా.వినోద్, డా.కౌశిక్, స్టేట్ కన్సల్టెంట్ కిరణ్, డీపీఓ లీలారాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొత్తపోలమ్మ వారాలు

పార్వతీపురం రూరల్: మండలంలోని వెంకంపేట గ్రామంలో గ్రామదేవత కొత్తపోలమ్మ వారాలను గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వారాల నేపథ్యంలో కొత్తపోలమ్మ ఘటాలను వెంకంపేట వీధుల్లో మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో ఊరేగించారు.

ఆశ్రమపాఠశాలలకు నిధులు మంజూరుచేయాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.వై నాయుడు

మక్కువ: జిల్లాలలోని అన్ని ఆశ్రమపాఠశాలలకు నిధులు మంజూరుచేసి, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వై.నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని ఎర్రసామంతవలస గిరిజనసంక్షేమ ఆశ్రమ పాఠశాలను మంగళవారం సీఐటీయూ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి నాయుడు మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలోని గిరిజనసంక్షేమ ఆశ్రమ పాఠశాల ల్లో విద్యార్థులు సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. గిరిజనశాఖ మంత్రి సంధ్యారాణి, ఐటీడీఏ పీవోలు స్పందించి, ఆశ్రమపాఠశాలలకు నిధులు మంజూరుచేసి, విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఏఎన్ఎం పోస్టులు మంజూరు చేయాలని, గతంలో మంత్రి సంధ్యారాణి ఇచ్చిన హామీలు అమలుచేయాలని కోరారు. నాన్‌టీచింగ్ సిబ్బంది కొరత ఉన్నందున అధికారులు, పాలకులు స్పందించి, సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజనసంఘం నాయకులు అర్లప్ప, చిన్నరాజు, మహేంద్ర, రవి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై మక్కువ చూపించాలి

మక్కువ: రైతులు ప్రకృతి వ్యవసాయం సాగుపై మక్కువ చూపించాలని ప్రకృతి వ్యవసాయ డీపీఎం ఎం.శ్రావణ్‌కుమార్ కోరారు. ఈ మేరకు మక్కువ మండలంలోని పనసభద్ర గ్రామానికి చెందిన రైతు డి.ధనబాబు వ్యవసాయ క్షేత్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. రైతు ధనబాబు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగుచేస్తున్న వరి రైజ్డ్‌బెడ్ పంటను డీపీఎం శ్రావణ్‌కుమార్ పరిశీలించారు. అనంతరం ఆయన రైతులకు ప్రకృతి వ్యవసాయంలో మెలకువలు, దిగుబడులపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల ఆరోగ్యకరమైన వ్యవసాయ ఉత్పత్తులు లభిస్తాయని చెప్పారు. రైతులు నూతన పద్ధతులు పాటించి, ఆర్థికంగా బలోపేతమవ్వాలని సూచించారు. అలాగే వరితోపాటు, ఆకుకూరలు, దుంపజాతులు, కూరగాయల పంటలను రైజ్డ్‌బెడ్‌పై సాగుచేయడం మంచి పరిణామమన్నారు. రైతులు ప్రకృతివ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏవో చింతల భారతి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నివారించాలి


ఓ3 అక్షరాల ఆకారంలో రూపొంది ప్రదర్శన ఇస్తున్న పెదబొండపల్లి విద్యార్థులు

పార్వతీపురం రూరల్: ప్లాస్టిక్ వాడకాన్ని నివారించి అవగాహనతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని పార్వతీపురం మండలంలోని పెదబొండపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. మంగళవారం ప్రపంచ ఓజోన్ పొర దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పర్యవరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ క్రమంలో విద్యార్థులు ఓ3 అక్షరాల ఆకారంలో ఏర్పడి ప్రదర్శన ఇచ్చారు. ఈ క్రమంలో ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు గౌరి, ప్రసాదరావు, భవానీ దేవి, శశిధర్ కుమార్‌తో పాటు అమరాపు సూర్యనారాయణ, దావీదు, జన, విజయ్, ఉమ, రామలింగస్వామి, శ్రీను, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.